
సాక్షి
బాపట్ల
శనివారం । 16 । డిసెంబర్ । 2023



వీల్‌చైర్ల బహుకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభాంతులైన ఇద్దరు చిన్నారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైఈఎస్‌బీజీ పార్థసారథి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి శుక్రవారం వీల్‌చైర్లు అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఎస్ఈబీ ఏఎస్పీకి ఉద్యోగోన్నతి



నగరంపాలెం: గుంటూరు ఎస్ఈబీ ఏఎస్పీ డీఎస్ మహేష్‌కు నాన్ కేడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విజయవాడ ఏసీబీ ఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

న్యూస్‌రీల్

అమరజీవి త్యాగశీలి



బాపట్ల: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం బాపట్లలోని పొట్టి శ్రీరాములు ప్రాంతీయ వైద్యశాలలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పమాలలతో కలెక్టర్ అంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కోన మాట్లాడుతూ శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి బి.అర్జున రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్.విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, పర్యవేక్షకులు రమేష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

అమరేశ్వరునికి రజత నాగాభరణం సమర్పణ



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరునికి శుక్రవారం రజత నాగాభరణం సమర్పించారు. ఒంగోలు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు గ్రంధి నాగభాస్కర్, శిరీష దంపతులు స్వామివారి ముందు భాగాన ప్రతిష్ఠించిన బాణచర లింగాకారానికి వెండి నాగాభరణం సమర్పించారు. సుమారు రూ.90 వేల విలువైన నాగాభరణానికి శుక్రవారం ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈఓ వేమూరి గోపీనాథశర్మకి అప్పగించారు. అనంతరం అర్చకుల ద్వారా స్వామి వారికి అలంకరించారు. తొలుత దాతలు స్వామివారికి అభిషేకం, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో కంది దిగుబడి 40,345 క్వింటాళ్లు

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



నరసరావుపేట: జిల్లాలో 40,346 క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చే అవకాశం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కందుల సేకరణపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. 2023–24కు క్వింటాలు రూ.7వేలు మద్దతు ధర ఉందన్నారు. ఖరీఫ్ కాలంలో రైతులు 17,326 హెక్టార్లు, రబీలో 3,017 హెక్టార్లలో సాగు చేశారన్నారు. పంట కోత జనవరి చివరి వారం నుంచి ప్రారంభమై మార్చి నాల్గవ వారంతో ముగుస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కందిపంట కొనుగోలు చేసేందుకు గోనె సంచులు, రవాణా వాహనాలు వివరాలు, సిబ్బంది లభ్యతపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన కందులను మిల్లింగ్ చేసేందుకు తగిన బ్యాంకు గ్యారంటీలను సమర్పించేందుకు సిద్ధంగా ఉండాలని పప్పుల మిల్లర్లను కోరారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, పప్పుల మిల్లర్లు పాల్గొన్నారు.

యార్డుకు 45,961 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,224 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,961 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 20,115 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

వేగంగా పంట నష్టం నమోదు



నగరంలో పంటనష్టం అంచనాలు రూపొందిస్తున్న అధికారులు

- క్షేత్రస్థాయిలో అధికారుల సర్వే
- శుక్రవారం నాటికి 33 శాతం అంచనాలు పూర్తి
- మరో రెండు రోజుల్లో మొత్తం పంట నష్ట జాబితాలు సిద్ధం
- 22 వరకూ ఆర్బీకేలలో నష్టపోయిన రైతుల పేర్లు
- ఆ సమయంలో మార్పులు, చేర్పులకు అవకాశం
- 26 నాటికి తుది జాబితా
- ఆ తరువాత కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మిచాంగ్ తుఫాన్ బాధితుల వివరాలను వెంటనే ప్రభుత్వానికి నివేదించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా అధికారులు నష్టం అంచనాలను శరవేగంగా రూపొందిస్తున్నారు. ఇందుకోసం ఈనెల 11 నుంచే వ్యవసాయ, రెవెన్యూ శాఖలు క్షేత్రస్థాయికి వెళ్లి తుఫాన్ నష్టం అంచనాలను రూపొందిస్తున్నాయి. తుఫాన్ ప్రభావ ప్రాంతాల్లో వాన వెలిసిన మరుక్షణమే గ్రామస్థాయి నుంచి నివేదికలు తెప్పించిన అధికారులు 93,243 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా తేల్చారు. పూర్తి స్థాయి సర్వే జరిపి నష్ట పోయిన రైతుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ చేపట్టారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదన్న ముఖ్యమంత్రి సూచనలతో అధికారులు ఆర్బీకేల స్థాయిలో బృందాలను నియమించి పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారు. శుక్రవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 44,085.41 హెక్టార్ల పరిధిలో సర్వేచేసి 55,035 మంది రైతులు నష్టపోయినట్లు తేల్చారు. ఈ లెక్కన ఇప్పటివరకు 33 శాతం సర్వే పూర్తి చేశారు. మరో మూడు రోజుల్లో సర్వే పూర్తిచేసి జాబితాలు సిద్ధం చేయనున్నారు. ఆ తరువాత సోషల్ ఆడిట్ కోసం జాబితాలను ఈనెల 18 నుంచి 22 వరకు రైతుభరోసా కేంద్రాలలో ప్రదర్శనకు ఉంచుతారు. జాబితాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నా, ఎవరి పేరైనా పొరపాటున జాబితాలో లేకపోయినా బాధితులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. మార్పులు, చేర్పుల అనంతరం ఈనెల 26న తుది జాబితాను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తారు. తరువాత జాబితాకు ఆమోదముద్రవేసి ప్రభుత్వం బాధిత రైతులకు పరిహారం చెల్లిస్తుంది.

ప్రాథమిక అంచనాల ప్రకారం..
పంటల వారీగా నష్టాలు ఇలా..

పంట	దెబ్బతిన్న విస్తీర్ణం(హెక్టార్లు)
వరి	75,411
పత్తి	1,129
మొక్కజొన్న,	3,530
కంది	738
మినుము	2,034
పొగాకు	9,232
ఇతర పంటలు	1,169
మొత్తం	93,243

వేగంగా పంట నష్టనమోదు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నీటమునిగి దెబ్బతిన్న పంటల నష్టం వివరాల జాబితాను వేగంగా సిద్ధం చేస్తున్నాం. ఏ ఒక్క రైతు నష్టపోకూడదన్న ఆలోచనతో క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే చేపట్టి నష్ట నివేదిక రూపొందిస్తున్నాం. శుక్రవారం నాటికి 33 శాతం సర్వే పూర్తయింది. మరో మూడు రోజుల్లో మొత్తం పూర్తికానుంది.

– అబ్దుల్ సత్తార్,
జిల్లా వ్యవసాయాధికారి, బాపట్ల జిల్లా

మండలాలు	సర్వే పూర్తయిన రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లలో)
అద్దంకి	375.8	454
అమర్తలూరు	3330.4	3398
బల్లికురవ	411.25	755
బాపట్ల	3181.57	3992
బట్టిప్రోలు	3146	4197
చెరకుపలి	3997	5407
చిన్నగంజాం	149	189
చీరాల	24	38
ఇంకొల్లు	249.92	347
జె.పంగులూరు	393.25	345
కారంచేడు	1460	1533
కర్లపాలెం	2434.1	3454
కొల్లూరు	1099	1300
కొరిశపాడు	279.32	247
మార్టూరు	377.4	517
నగరం	5008	5755
నిజాంపట్నం	2719	3439
పర్చూరు	2075	1870
పిట్టలవానిపాలెం	2370.4	3123
రేపల్లె	4018	5093
సంతమాగులూరు	103	162
చుండూరు	3782	5471
వేమూరు	2717	3290
వేటపాలెం	30	59
యద్దనపూడి	355	600
మొత్తం	44,085.41	55,035

అందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు

డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ

చీరాల టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు.. అర్హులందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలని జిల్లా డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ సూచించారు. శుక్రవారం ఆమె ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది పనితీరుపై సూచనలు చేశారు. విజయమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు వైద్య ఆరోగ్యశాఖలోని వైద్యులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. అందరికి ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ నూతన కార్డులు ఈనెల 20 నుంచి పంపిణీ చేస్తున్నారన్నారు. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు పొందిన వ్యాధిగ్రస్తులు ఆరోగ్య రికార్డులను విధిగా నమోదు చేయాలన్నారు. సేవల్లో లోపాలు లేకుండా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం రెండో విడతలో మండలంలో వారానికి ఒక క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికోసం ఆరోగ్యశ్రీ పథకం సంజీవిని లాగా పనిచేస్తుందని, వైద్య సిబ్బంది ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలకు నిరంతరం సూచనలు అందించాలన్నారు. ఆమె వెంట సీహెచ్‌వో మోక్షవాణి, సిబ్బంది ఉన్నారు.

మహిళ ఎస్ఐ అభ్యర్థులకు ఫిజికల్ పరీక్షలు

నగరంపాలెం: స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మహిళ ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఏపీ రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు గతంలో హాజరు కాని 20 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, ఈవెంట్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఆదేశాల మేరకు ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఎస్పీ సుబ్బారెడ్డి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పరీక్షలను పర్యవేక్షించారు.

కోడిపోరు.. ఉత్సవ జోరు

- కాలుదువ్విన పల్నాటి పౌరుషం
- నాలుగోరోజు వీరారాధనోత్సవాలు
- వీరాచారవంతుల నృత్యాలు



గ్రామోత్సవంలో వీరాచారుల వీరంగం

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం కోడిపోరు వైభవంగా సాగింది. పల్నాటి పౌరుషం కాలుదువ్వింది. వీరుల గుడి నుంచి వేకువ జామునే పల్నాటి వీరుల ఆయుధాల (దైవాలు)తో వీరాచారవంతులు గ్రామోత్సవానికి బయలు దేరారు. దైవాల ముందు నృత్యాలు చేస్తూ వీరంగమాడారు. యథాప్రకారం చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లి దర్శనం చేసుకుని ఉత్తరంగా ఉన్న వీధి నుంచి బ్రహ్మనాయుడు మేడ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రజలు ముందుగా పసుపునీళ్లతో వారుపోసి వీరాచారవంతుల కాళ్లపై నీళ్లు చల్లి, పల్నాటి వీరుల ఆయుధాలకు పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి దక్షిణలు సమర్పించారు. శనివారం అర్ధరాత్రి దాటేంత వరకు గ్రామోత్సవం కొనసాగింది. వీరంగాలు తప్ప కత్తి సేవలు కన్పించలేదు. పల్నాటి వీరుల ఆయుధాలతో తరలివచ్చి అంకాలమ్మ, చెన్నకేశవ స్వామికి మొక్కులు చెల్లించే కార్యక్రమాలు జరిగాయి. వీరాచారవంతుల చేతుల్లో కోడి పుంజులు దర్శనమిచ్చాయి. పొట్టేళ్లు అంకాలమ్మ గుడి వైపు నడిచాయి. ప్రతి మహిళ నెత్తిపై బోనం కన్పించింది. వీరాచారుల కుటుంబాలు తమ ఆచార వ్యవహారాలు నెరవేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజలు కూడా గ్రామోత్సవానికి వస్తున్న దైవాల కోసం రాత్రంతా మేలుకుని ఇంటి ముందు పూజా సామగ్రితో నిల్చున్నారు. వీరుల ఆయుధాల ముందు మహిళలు దేవతలు ఆవహించినట్లు ఊగిపోయారు. శనివారంతో ఉత్సవాలు ముగియనున్న నేపథ్యంలో చివరిరోజు వీరులు కళ్లికి ఒరుగు క్రమం ఉండడంతో వీరాచారవంతులంతా శుక్రవారం తమ వీరాచారం నెరవేర్చుకుని అంకాలమ్మ, చెన్నకేశవస్వామికి మొక్కులు చెల్లించారు.

రసవత్తరంగా కీలక ఘట్టం

ఇదిలా ఉంటే వీరుల గుడి ఆవరణలో అలనాడు బ్రహ్మనాయుడు, నాగమ్మల మధ్య జరిగిన కోడి పోరును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కొమ్మారెడ్డి చలమారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొని కోడి పోరును మూడు విడతలుగా నిర్వహించారు. బ్రహ్మనాయుడు పుంజు రతనాల చిట్టిమల్లు, నాయకురాలు నాగమ్మ పుంజు శివంగి డేగల మధ్య అలనాడు జరిగిన పోరును స్మరించుకునే విధంగా ప్రదర్శన సాగింది. పల్నాటి వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేస్తుండగా ఈ ఘట్టం జరిగింది. పీఆర్కే, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం పోరుకు పుంజులను వదిలారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, నాయకురాలు నాగమ్మ వేషంలో ఉన్న ఆచారవంతుడు ఊరేగింపుగా కోడిపోరు ప్రాంగణానికి పల్నాటి వీరుల ఆయుధాలతో తరలివచ్చారు. కోడిపోరుకు ముందుగా పీఆర్కే, చలమారెడ్డి వీరుల గుడికి వెళ్లి వీరుల ఆయుధాలకు పూజలు చేసి అనంతరం కోడిపోరు ప్రదర్శనలో పాల్గొన్నారు. కోడిపోరు ముగిసిన తర్వాత వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేశారు. కోడిపోరుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. పల్నాటి వీరాచార పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ కోడిపోరుకు హాజరైన పెద్దలను సన్మానించారు.



కోడిపోరులో కోడి పుంజుతో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

'తాపీ'గా బైక్ చోరీలు

- వృత్తి తాపీ పని, ప్రవృత్తి బైక్ చోరీలు
- విలాసాల కోసమే దొంగతనాలు
- పట్టుకున్న పల్నాడు పోలీసులు
- రూ. 24 లక్షల విలువైన 34 ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసరావుపేట: సుమారు రెండేళ్ల నుంచి పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.24 లక్షల విలువైన 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం లింగారావుపాలెంకు చెందిన 36 ఏళ్ల యూతం వీరభద్రరావు తాపీ పనులు చేస్తుంటాడు. వ్యసనాలకు బానిసైన అతను సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీల బాట పట్టాడు. 2002లో నరసరావుపేటలో సైకిల్ దొంగతనం చేసి పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. పొలాలు, తిరునాళ్ళలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను తాపీగా దొంగిలించడం అలవాటు చేసుకున్నాడు. పెదకూరపాడు, సత్తెనపల్లి, వినుకొండ, ఐనవోలు, పరుచూరు, మార్టూరు, ఇంకొల్లు, కాకుమాను, పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్ చోరీలకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు ఉప్పలపాడు సెంటర్ వద్దకు పోలీసులు వెళ్లారు. అక్కడ బైక్‌తో ఉన్న వీరభద్రరావు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఎస్ఐ తన సిబ్బంది సహాయంతో అతడిని పట్టుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. దొంగిలించిన మోటార్ సైకిళ్లను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకొని పోలీసులు అరెస్టు చేశారు. బైక్ దొంగను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ మహేష్, సీఐ యు.సుధాకర్‌బాబు, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు పి.రామకోటి, షేక్ ఖాసీం, కానిస్టేబుళ్లు బి.నరేంద్ర, పీవీ రామయ్య, డి.సురేష్, వై.ప్రశాంతిరెడ్డిలను ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కోసం దరఖాస్తులు

బాపట్ల అర్బన్: జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి రాజ్ దిబోరా శుక్రవారం తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి నగదు ప్రోత్సాహకంగా ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రిలిమినరీలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు ప్రోత్సాహకం ఉంటుందన్నారు. 2023లో నిర్వహించిన యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థులకు రూ.50 వేలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. jnanabhumi.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డిసెంబర్ 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలేని కోరారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

చినగంజాం: నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం మండలంలోని కడవకుదురు జెడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించనున్నట్లు బాపట్ల అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపికల్లో అండర్-14, 16 వయసు కేటగిరిలో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో ట్రయథ్లాన్ ఏ, ట్రయథ్లాన్ బీ, ట్రయథ్లాన్ సీ, కిడ్స్ జావెలిన్ పోటీలు, అండర్-16 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెం, 80 మీటర్ల హార్డిల్స్, 600 మీటర్లు పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, పెంటథ్లాన్‌లో 60 మీటర్లు పరుగు పందెం, 80 మీటర్ల హార్డిల్స్, 600 మీటర్ల పరుగు పందెం జరుగుతాయని తెలిపారు. వివరాలకు 96663 63471, 80749 92796ను సంప్రదించాలని వారు కోరారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. బాపట్లలోని పొట్టి శ్రీరాములు ప్రాంతీయ వైద్యశాలను కలెక్టర్, ఎమ్మెల్యే కోన రఘుపతి కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఓపీ విభాగం, ఆరోగ్యశ్రీ సేవలతో పాటు ప్రతి విభాగాన్ని పరిశీలించారు. ప్రతిరోజు సగటున 700 ఓపి నమోదు అవుతున్నాయని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోగులతో కలెక్టర్ మాట్లాడారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారు. ఏ రోగంతో బాధపడుతున్నారంటూ ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందుతుందా అంటూ వారికి పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. ల్యాబ్ విభాగంలో రక్త పరీక్షల సేకరణ, డెంగీ, మలేరియా పరీక్షలు, ఇతర ప్రధానమైన రక్త పరీక్షలు, యంత్రాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, కాన్పులతో శిశువుల జననాలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో 24 గంటల పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. రోగుల సంఖ్య ఆధారంగా వైద్యశాలకు అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య కళాశాల నిర్మాణంతో బాపట్ల జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. 500 పడకలతో జిల్లా వైద్యశాల, వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. కనీసం 50 శాతం మంది వైద్యాధికారులు పనిచేసే ప్రాంతంలోనే నివాసముండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఎస్.వి జయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ పాల్గొన్నారు.



ఏరియా వైద్యశాలలో బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ రంజిత్‌బాషా

18లోగా పంటనష్టం అంచనాలు తయారు చేయాలి

జిల్లాలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొలాల పంట నష్ట అంచనాలు ఈనెల18వ తేదీలోగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో పంట నష్టం అంచనాలు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు, గృహ నిర్మాణాలు అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పంట నష్ట వివరాలపై రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు ఈనెల 26 నాటికి పరిష్కరించాలని కోరారు. జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు గృహ నిర్మాణాల పురోగతిపై నిర్లక్ష్యం చేసే అధికారులకు సంజాయిషీ నోటీసులు ఇవ్వాలని హౌసింగ్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. చీరాల మున్సిపాలిటీలో అర్బన్ హౌసింగ్ పనుల్లో కమిషన్ పనితీరు బాగా లేదన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, చేర్పులు కొరకు వచ్చిన అర్జీలను ఈనెల 25 తేదీ నాటికి విచారించాలని కోరారు. ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీధర్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ హరినారాయణ పాల్గొన్నారు.

ఇష్టంగా పనిచేస్తే మంచి ఫలితాలు

బాపట్ల అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యకరమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులంతా తమ విధులపై దృష్టి సారించి, ఇష్టంగా పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే దిశగా అధికారులు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు సమర్థంగా విధులు నిర్వహించేలా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతినెల మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఎవరైనా ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. ఉద్యోగుల సర్వీస్ విషయాలలో ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను వారికి ఎప్పటికప్పుడు అందేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ, పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయం శిరోధార్యం

- రాబోవు ఎన్నికల్లో రేపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేస్తాం
- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఏ నిర్ణయానికైనా కట్టుబడి పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ జాతీయ స్థాయిలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో అందరి మన్ననలు పొందేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175/175 స్థానాలు గెలవాలనే ఆలోచనతో ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా కొన్ని ప్రత్యేక కారణాల వలన రాష్ట్రంలో కొన్నిచోట్ల అధినాయకత్వం కొన్ని నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని వివరించారు. నాయకత్వం ఒక నిర్ణయం తీసుకున్న తరువాత క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తాను, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు దానికి కట్టుబడి ఉంటామని, ధిక్కరించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రేపల్లె నియోజకవర్గానికి సంబంధించి కొంత కాలంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతూ అనునిత్యం ప్రజల్లో ఉన్నానని, ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు దిగ్విజయంగా నిర్వహించినట్లు చెప్పారు. అధిష్టానం ఇటీవల రేపల్లె నియోజకవర్గానికి డాక్టర్ ఈవూరి గణేష్‌ను ఇన్‌చార్జిగా నియమించటం జరిగిందని తెలిపారు. ఆ సమయంలో తాను వ్యక్తిగత పనుల మీద బయట ఉన్నానని, ఆ నిర్ణయంతో నియోజకవర్గంలోని నాయకులకు కొంత బాధ కలిగి ఆవేశపూరితంగా రాజీనామాలు చేసినట్లు చెప్పారు. వారికి తాను నచ్చ చెబుతానని, దీనిని అధిష్టానం కూడా ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై కొన్ని మీడియా చానళ్ల, పత్రికలు ఇష్టానుసారంగా ఇన్‌చార్జిని నియమించటంతో మోపిదేవి ముఖం చాటేశాడు అని ఒకరు, పార్టీ మారుతున్నాడు అంటూ మరొకరు ఇష్టానుసారంగా రాస్తున్నారని ఇది మంచి సంస్కృతి కాదని హితవు పలికారు. పార్టీలో ఏ సమస్యలు ఉన్నా మేము కుటుంబ సభ్యులుగా చర్చించుకుని సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. తాను 40 సంవత్సరాలుగా నైతిక విలువలతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఒక క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగానే రాజకీయాలు చేశానని అన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేసి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటామని, అందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో బుడా ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, చెరుకుపల్లి ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, కామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

ఎమ్మెల్సీ పోతుల సునీత



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి పొట్టి శ్రీరాములు మహనీయుడని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ముక్కోణం పార్కు వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతూ చేసిన ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయుడని చెప్పారు. ఆయన ప్రాణ త్యాగ ఫలితంగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. నేటి యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోతుల సురేష్, పార్టీ సీపీ పట్టణ-2 అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, పొత్తూరి సుబ్బయ్య, గుంటూరు ప్రభాకరరావు, అవ్వారు మోహనరావు, బుర్ల సుబ్బారావు, ఎంజీసీ మార్కెట్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరులను ఆదర్శంగా తీసుకోవాలి



పొట్టి శ్రీరాములు, పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ మహేష్

బాపట్ల టౌన్: స్వాతంత్ర్యోద్యమంలో అసువులు బాసిన అమరుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిలను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశానికి తుది రూపునిచ్చి, దేశ రక్షణ, సమగ్రత కోసం ఎనలేని కృషి చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కే దక్కుతోందని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం అప్పటి మద్రాస్ రాష్ట్రంలో ఉన్న తెలుగు మాట్లాడే పదకొండు జిల్లాలను ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో అక్టోబరు 19, 1952లో మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి పట్టు వీడకుండా తన నిరాహార దీక్షను కొనసాగించి రాష్ట్ర సాధన కొరకు డిసెంబర్ 15న అమరజీవి పొట్టి శ్రీరాములు అమరుడైనారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్ కుమార్, ఎస్బీ సీఐ వి.సూర్యనారాయణ, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, హోంగార్డ్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్ పాల్గొన్నారు.

జగనన్న సంస్కరణలకు నిలయం సావిత్రమ్మ స్కూలు

ఏపీ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



హెచ్‌ఎం మాధవీని సత్కరిస్తున్న ఏపీ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

రేపల్లె: విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ జగనన్న అమలు పరుస్తున్న సంస్కరణలకు మహానటి సావిత్రమ్మ స్కూల్ ఆదర్శంగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలం వడ్డివారిపాలెంలో మహానటి సావిత్రి స్థాపించిన సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి జయంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పన, పరిసరాలు పరిశుభ్రత, క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం చూస్తుంటే విద్యాపరంగా జగనన్న కలలకు నిలయంగా ఈ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కార్పొరేట్ స్థాయికి మించి పాఠశాల నిర్వహణ ఉందన్నారు. హైస్కూల్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. తొలుత సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధికి దోహదపడుతున్న పూర్వ విద్యార్థులు, హెచ్‌ఎం మాధవీ, ఉపాధ్యాయులను కొమ్మినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా మహానటి సావిత్రి కళాపీఠం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఏపీ మీడియా అకాడమీ సెక్రటరీ బాలగంగాధర్ తిలక్, పాఠశాల హెచ్‌ఎం మాధవీ, సర్పంచి వడ్డి సునీతశ్రీనివాసరావు, గ్రామస్తులు వడ్డి లక్ష్మోజీ, వడ్డి హనుమంతరావు, టి.రమణ, పూర్వ విద్యార్థులు జి.అంకమ్మ, కె.తిరుపతి వెంకయ్య పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

20న కాకినాడలో చాంపియన్ షిప్ పోటీలు



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న అతిథులు నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ సురేష్

చినగంజాం: ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ పోటీల క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం మండలంలోని కడవకుదురు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి క్రీడాకారులు పోటీలకు హాజరు కాగా పోటీలు అనంతరం ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-20 గరల్స్ విభాగంలో నాగలక్ష్మి (చీరాల), నీలిమ (చీరాల), మేఘన (చీరాల). బాలుర విభాగంలో ఏ రామ సూర్యగణేష్ (ఒంగోలు), వై గోపి (చీరాల), వీ అజయ్‌బాబు (పెదగంజాం), బీ అయ్యప్ప (ఒంగోలు), యూ సాగర్ (కడవకుదురు), ఎస్ నాగేంద్ర బాబు (కొత్తపట్నం). అండర్-16 గరల్స్ విభాగంలో పీ మనీషా (చినగంజాం), బాలుర విభాంలో జీ ఈశ్వరకుమార్, బీ చిన్నరాగ్యానాయక్ (యర్రగొండపాలెం), అండర్-20 పురుషులు చీరాలకు చెందిన క్రీడాకారులు బీ శామ్యూల్, ఎస్.వేణుబాబు, ఆర్.అశోక్ కుమార్, ఎస్.మణిబాబు, పీ సందీప్, అండర్-20 మహిళల విభాగంలో చీరాలకు చెందిన డీ త్రివేణి, పీవీ ఐశ్వర్య, డీ బబిత, వీ చినసీల, ఎస్ రమ్యజాయ్, కే గీతాంజలిలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20వ తేదీ కాకినాడలో జరగనున్న పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనున్నట్లు కోచ్ అనంత కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ కే సురేష్, హెచ్‌ఎం కుర్రా రామారావు, కమిటీ సభ్యులు బోగిరెడ్డి స్వామిరెడ్డి, బాలయ్య, వెంకటరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అనంతకుమార్ రెడ్డి, వాణిశ్రీ, జ్యోతి పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన కేసులో భర్త అరెస్టు

- ఆత్మహత్యగా చిత్రీకరణ
- పోస్టుమార్టంలో గొంతునుమిలిన గాయాలతో తేలిన నిజం
- వివరాలు వెల్లడించిన పోలీసులు

పర్చూరు (చినగంజాం): భార్య మీద అనుమానంతో భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు ఓ కర్కోటక భర్త. సీఐ అక్కేశ్వరరావు, ఎస్సై రవిశంకర్‌రెడ్డి శుక్రవారం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పర్చూరు మండలం ఏదుబాడు గ్రామానికి చెందిన నిజాంపట్నం నిర్మల (54) ఈ ఏడాది మార్చిలో హత్యకు గురైంది. శ్రీనివాసరావు, నిజాంపట్నం నిర్మల భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంలో నష్టం వచ్చి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంట్లో ఉరేసుకొని చనిపోయినట్లు అందరూ భావించారు. ఆమె భర్త శ్రీనివాసరావు కూడా గ్రామంలో తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు అందరిని నమ్మించాడు. అనంతరం ఈఏడాది మేలో చీరాల ప్రభుత్వ వైద్యశాల నుంచి ఆత్మహత్యకు సంబంధించి పోస్టుమార్టం నివేదిక పర్చూరు పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అందులో నిర్మలది ఆత్మహత్య కాదని గొంతు దగ్గర గాయాలు ఉండటంతో ఆమెను ఎవరో హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో విస్తుపోయిన పోలీసులు హత్య కోణంలో విచారణ చేపట్టారు. భర్త శ్రీనివాసరావుపై అనుమానంతో అతని కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఏదుబాడు గ్రామ రెవెన్యూ అధికారి బుల్లిబాబు ముందు శుక్రవారం లొంగిపోయినట్లు సీఐ అక్కేశ్వరరావు తెలిపారు. పోలీసులు అతనిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిర్మల అక్రమ సంబంధం పెట్టుకోవడం వల్లే ఆమెను గొంతు నులిమి చంపి, ఆత్మహత్య చేసుకున్నట్లు సృష్టించానని శ్రీనివాసరావు ఒప్పుకున్నట్లు సీఐ వివరించారు. నిందితుడిని శుక్రవారం కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మెసేజ్‌లతో యువకులకు వల..

కారంచేడులో సరికొత్త రీతిలో సైబర్ క్రైం

కారంచేడు: సైబర్ నేరగాళ్లు రోజుకో వేషంలో హద్దు మీరుతున్నారు. దీంతో అమాయకులు మోసపోయి లబోదిబోమంటున్నారు. మండల కేంద్రం కారంచేడులో మరో సరికొత్త కోణంలో సైబర్ క్రైం కేసు వెలుగు చూసింది. కారంచేడు గ్రామానికి చెందిన కట్టా వెంకటేష్‌కు ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. మీరు 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రభుత్వ స్కీంలో రూ.25 లక్షల గెలుచుకున్నారు.. దీనికి మీరు చేయాల్సిందల్లా ముందు మీ అకౌంట్ నంబర్, ఆధార్, అడ్రస్‌తో కూడిన వివరాలు అందించాలని మెసేజ్‌లో కోరారు. ఆ తరువాత మీరు గెలుచుకున్న నగదును పొందేందుకు మీ బ్యాంకు అకౌంట్ వెరిఫై చేయడానికి మేము ఇచ్చే అకౌంట్‌కు రూ.12,500 నగదు జమ చేయాలని, ఈ అమౌంట్ మీకు వచ్చే నగదు పారితోషానికి ఇన్‌కం టాక్స్‌గా ఉంటుందని నమ్మబలికారు. బాధితుడికి నమ్మకం కలగడానికి ఇన్‌కం టాక్స్ నుంచి మీకు జనరేట్ అయిన సర్టిఫికెట్ కూడా పంపిస్తున్నామని ఒక ఫేక్ సర్టిఫికెట్ వాట్సప్‌కు పంపారు. అది చూసి నిజమే అని నమ్మిన వెంకటేష్ వారు ఇచ్చిన ఫోన్ పే నంబర్‌కు రూ.12,200 నగదు పంపించాడు. నగదు పంపిన 30 నిమిషాల తరువాత వచ్చిన కాల్‌లో మీ అడ్రస్, ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్లు కూడా వెరిఫై అయ్యాయని, మీకు నగదు పూర్తిగా బదిలీ అవ్వడానికి మరో రూ.12,500 పంపాలని వారు మెసేజ్ పెట్టారు. ఇది చూసి అనుమానం వచ్చిన ఆ యువకుడు వెంటనే గ్రామంలో తనకు తెలిసిన ఒక వ్యక్తికి సమాచారం అందిచాడు. ఆ వ్యక్తి నువ్వు మోసపోయావని, ఇది ఒక పెద్ద స్కాం అని చెప్పడంతో వెంకటేష్ ఏం చేయాలో తోచక లబోదిబోమన్నాడు. గతంలోనూ కారంచేడు మీసేవ కేంద్రంలో ఒక రైతు వేషంలో వచ్చిన మోసగాడు ఫోన్‌పే ద్వారా నగదును వేయించి నమ్మించి మోసం చేసిన సంగతి తెలిసిందే. సైబర్ క్రై మోసగాళ్లు రోజుకో కొంత పుంతలు తొక్కుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

జే.పంగులూరులో కార్మికుడు..

జే పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం గ్రామం జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటల్లో ఒడిశాకు చెందిన యువకులు పనిచేస్తున్నారు. వారిలో ఖాజన్ అనే యువకుడికి బుధవారం వాట్సాప్ ద్వారా జియో కంపెనీ ఆఫర్ ద్వారా 5జీ జియో ఫోన్ గెలుచుకున్నారని ఫోన్ వచ్చింది. వెంటనే యుకుడికి వాట్సాప్ ద్వారా ఫొటో పంపించారు. అది నిజమని నమ్మిన ఖాజన్ గురువారం వారు కోరిన వెంటనే ఫోన్ పే ద్వారా రూ.210 సర్వీస్ చార్జ్ పంపించాడు. తిరిగి కొరియర్ చార్జ్ రూ.1260 కోరగా అవికూడా పంపించాడు. గురువారం సాయంత్రం యువకుడికి ఫోన్ డెలివరీ చేయాలంటే రూ. 1207 చెల్లించాలని కోరారు. అవి కూడా ఫోన్ పే ద్వారా పంపించాడు. అంతటితో ఆగకుండా ఫోన్ చేసి ఇంకా డబ్బులు కట్టాలని ఒత్తిడి చేశారు చేసేది లేక ఖాజన్ హోటల్ యజమానికి వివరించాడు. ఆ యజమాని నేరగాళ్లతో కోపంతో మాట్లాడే సరికి వారికి ఫోన్ కలవకుండా చేశారు.

కలప లోడు లారీ బోల్తా.. వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: కలప లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం తెల్లవారుజామున అద్దంకి మండలం చక్రాయపాలెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. నిజామాబాద్‌కు చెందిన లింగయ్య (38) నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి చెక్క సామగ్రి తరలించేందుకు వచ్చాడు. గుడ్డ టేకు, దర్వాజాలు తీసుకుని లారీలో గురువారం రాత్రి కందుకూరుకు బయలుదేరాడు. ఈక్రమంలో లారీ అద్దం-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై ఉన్న చక్రాయపాలెం గ్రామ సమీపంలోకి రాగానే శుక్రవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో లారీలో ఉన్న లింగయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. మిగిలిన ఐదుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.